21న సదర్‌మేళా



కిషన్‌రెడ్డికి ఆహ్వానపత్రిక అందజేస్తున్న యాదవ సంఘం ప్రతినిధులు

సైదాబాద్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉప్పరిగూడ యాదవ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 21న చంచల్‌గూడ చౌరస్తాలో సదర్‌మేళా నిర్వహించనున్నట్టు సంఘం ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు శనివారం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయలతో పాటు పలువురు ఎమ్మెల్యేలకు సంఘం ప్రతినిధులు ఆహ్వాన పత్రిక అందజేశారు. కార్యక్రమంలో సంఘం నేతలు సంపత్‌యాదవ్, నిరంజన్‌యాదవ్, రాంపాల్ యాదవ్, శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.



స్ట్రామ్ వాటర్ డ్రైయిన్ నిర్మాణ పనులకు భూమిపూజ చేస్తున్న కార్పొరేటర్ మధుసూదన్‌రెడ్డి

ఆలయ అభివృద్ధికి కృషి: కార్పొరేటర్

చంపాపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి అన్నారు. కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయంలో రూ.8లక్షల వ్యయంతో చేపట్టనున్న స్ట్రామ్ వాటర్ డ్రైయిన్ పైపులైన్ నిర్మాణ పనులకు శనివారం ఆలయ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, ఆలయ ఈవో లావణ్యతో కలిసి కార్పొరేటర్ భూమిపూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఆలయంలో త్వరలో సీసీ రహదారులతో పాటు మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు కార్పొరేటర్ పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధికి ప్రభుత్వ నిధులతో పాటు దాతలు సహకరించాలని ఆలయ చైర్మన్ కోరారు. కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, ఆలయ ధర్మకర్తలు పాల్గొన్నారు.

బీజేపీ అభ్యర్థిని గెలిపించండి: కార్పొరేటర్

కొత్తపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో బీజేపీ అభ్యర్థి లంకల దీపక్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్ ఓటర్లను అభ్యర్థించారు. శనివారం ఆయన మధురానగర్ కాలనీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీజేపీ అభ్యర్థి విజయానికి సహకరించాలని పవన్‌కుమార్ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి సుందర్ నారాయణ, కొత్తపేట డివిజన్ ప్రధాన కార్యదర్శి మహేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాక్స్‌డ్రైన్ నిర్మాణ పనుల పరిశీలన

ఓల్డ్‌మలక్‌పేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఓల్డ్‌మలక్‌పేటలో మూడున్నర కోట్ల రూపాయలతో బాక్స్‌డ్రైన్ నిర్మాణ పనులు చేపట్టినట్లు ఎంఐఎం మలక్‌పేట డివిజన్ అధ్యక్షుడు షఫియుద్దీన్ తెలిపారు. శనివారం డ్రైనేజీ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. మరో మూడు కోట్లతో కాలనీల్లో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణం చేపడతామని షఫియుద్దీన్ తెలిపారు.



వరదనీటి నాలాను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

నాలాలో వ్యర్థాలు కలవనివ్వొద్దు: నర్సింహారెడ్డి

మన్సూరాబాద్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): వరదనీటి నాలాల్లోకి డ్రైనేజీ మురుగు, వ్యర్థ రసాయనాలు కలవనివ్వొద్దని బీజేపీ జీహెచ్‌ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి సూచించారు. డివిజన్ పరిధిలోని సహారాస్టేట్స్ వెనుక భాగంలో గల వరదనీటి నాలాలో డ్రైనేజీ మురుగు, వ్యర్థ రసాయనాలు కలవడాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ, ఆటోనగర్ నుంచి వచ్చే వరదనీటి నాలాలో డ్రైనేజీ మురుగు, వ్యర్థ రసాయనాలు కలిసి కలుషితమవుతున్నాయన్నారు. దీంతో పరిసర ప్రాంతాల ప్రజలకు అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదముందన్నారు. కార్పొరేటర్ ఆదేశాల మేరకు వ్యర్థ రసాయనాలు, డ్రైనేజీ మురుగు వరదనీటి నాలాలో చేరకుండా సిబ్బంది చర్యలు చేపట్టారు.



బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు శేఖర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సోషల్ మీడియా కన్వీనర్ ప్రహ్లాద్

బీఎస్పీ జిల్లా సోషల్ మీడియా కన్వీనర్‌గా ప్రహ్లాద్

అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): బీఎస్పీ రంగారెడ్డి జిల్లా సోషల్ మీడియా కన్వీనర్‌గా పెద్దఅంబర్‌పేట్‌కు చెందిన పార్టీ సీనియర్ నాయకుడు యంజాల ప్రహ్లాద్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా శనివారం బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఇబ్రాం శేఖర్‌ను ఆయన నివాసంలో ప్రహ్లాద్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. బహుజనులకు రాజ్యాధికారమే లక్ష్యంగా పని చేస్తానని ప్రహ్లాద్ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మల్లేష్, కృష్ణ, తరుణ్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

22 నుంచి కార్తీక మాసోత్సవాలు

కొత్తపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కొత్తపేట డివిజన్ స్నేహపురి పద్మావతీగోదా సమేత వేంకటేశ్వర ఆలయంలో ఈ నెల 22 నుంచి కార్తీక మాసోత్సవాలు ప్రారంభమవుతాయని ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు తెలిపారు. ఈ నెల 22 నుంచి నవంబర్ 20 వరకు స్వామివార్లకు విశేష పూజలు, అభిషేకాలు హోమాలు, కుంకుమార్చనలు, వ్రతాలు, దీపోత్సవాలు, జ్వాలా తోరణం, మహాలింగార్చన తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు వారు తెలిపారు.



ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులతో ప్రొఫెసర్ విద్యాసాగర్

ముగిసిన ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం

అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ గౌరెల్లిలో వారం రోజులు నిర్వహించిన ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం శనివారంతో ముగిసింది. నగరంలోని ప్రగతి మహావిద్యాలయంకు చెందిన ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు గ్రామంలో పలు స్వచ్ఛంద సేవా కార్యక్రమాలతో పాటు అవగాహన సదస్సులు నిర్వహించారు. ముగింపు కార్యక్రమానికి యూనివర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ కో-ఆర్డినేటర్ ప్రొ.విద్యాసాగర్ ముఖ్య అతిధిగా హాజరై విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డా.శోభారాణి, మున్సిపల్ అధికారి శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ బంద్ ప్రశాంతం

- డిపోలకే పరిమితమైన ఆర్టీసీ బస్సులు
- వ్యాపార సముదాయాలను మూసివేయించిన నేతలు
- బంద్‌లో పాల్గొన్న అన్ని రాజకీయ పార్టీలు, బీసీ సంఘాలు
- రోడ్డుపై బైఠాయింపు.. భారీగా ట్రాఫిక్‌జామ్



వెంగళరావునగర్‌లో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలియజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ మధు, మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు తదితరులు



కుండ తయారు చేస్తూ నిరసన తెలియజేస్తున్న కుమ్మరి సంఘం నాయకులు



ఎల్‌బీనగర్‌లో రోడ్డుపై పడుకుని నిరసన తెలియజేస్తున్న బీసీ సంఘాల జేఏసీ నేతలు



బస్సులు నడవకపోవడంతో ఆటోలను ఆశ్రయిస్తున్న ప్రయాణికులు



బీసీ బంద్‌కు మద్దతుగా నిరసన తెలియజేస్తున్న ఆర్టీసీ దిల్‌సుఖ్‌నగర్ డిపో కార్మికులు



దిల్‌సుఖ్‌నగర్: డిపోకే పరిమితమైన బస్సులు



కొత్తపేట చౌరస్తాలో బైక్ ర్యాలీలో పాల్గొన్న టీజేఎస్ నాయకులు పల్లె వినయ్‌కుమార్, రంగారెడ్డి తదితరులు



రోడ్డుపై బైఠాయించి నిరసన తెలియజేస్తున్న విశారదన్ మహరాజ్, రాజశేఖర్‌రెడ్డి తదితరులు



ఎల్బీనగర్‌లో వ్యాపార సముదాయాలను మూసివేస్తున్న బీసీ నేతలు

ఎల్‌బీనగర్/ దిల్‌సుఖ్‌నగర్ జోన్ బృందం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో బీసీలకు 42శాతం రిజర్వేషన్ల అమలుపై హైకోర్టు స్టే విధించడాన్ని నిరసిస్తూ బీసీ సంఘాల జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు శనివారం నిర్వహించిన బీసీ బంద్ ప్రశాంతంగా జరిగింది. ఎల్‌బీనగర్, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, మలక్‌పేట, యాఖుత్‌పుర నియోజకవర్గాల పరిధిలో చేపట్టిన బంద్‌లో అన్ని రాజకీయ పార్టీల నేతలు, బీసీ, మాల, మాదిగ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. విద్యాసంస్థలు ముందుగానే సెలవు ప్రకటించాయి. ఆర్టీసీ బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. దీంతో ప్రయాణికులు ఆటోలు, ప్రైవేటు రవాణ సంస్థలను ఆశ్రయించారు. తెరిచి ఉంచిన వ్యాపార సముదాయాలను ఆందోళనకారులు మూసివేయించారు. ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి వెంగళరావునగర్‌లో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. కంచన్‌బాగ్‌లోని మిధానీ బస్సు డిపో ముందు నిర్వహించిన బీసీ సంఘాల ఆందోళనకు ఆర్టీసీ సిబ్బంది బంద్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ముసారాంబాగ్ చౌరస్తాలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసి కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఐఎస్‌సదన్ చౌరస్తాలో సీపీఐ, సీపీఎం, ప్రజాసంఘాల నేతలతో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్ కలిసి కేంద్ర ప్రభుత్వం దిష్టిబొమ్మను దహనం చేశారు. బడంగ్‌పేట్ కార్పొరేషన్ పరిధిలోని గ్రామాల్లో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చిగిరింత నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి, రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి, బీసీ రిజర్వేషన్లకు అనుకూలంగా నినాదాలు చేశారు. బాలాపూర్ చౌరస్తాలో వామపక్ష పార్టీలైన సీపీఐ, సీపీఎం, సీపీఐ మాస్‌లైన్(ఎంఎల్) పార్టీల నాయకులు నిరసన వ్యక్తం చేశారు. బీసీ రిజర్వేషన్లను అమలు చేయాలని బీఆర్‌ఎస్ నేత భూపేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో మీర్‌పేట్, జిల్లెలగూడ ప్రాంతాల్లో బంద్ నిర్వహించారు. హయత్‌నగర్‌లో ఎల్‌బీనగర్ డీసీపీ అనురాధ, అడిషనల్ డీసీపీ కోటేశ్వర్‌రావు, హయత్‌నగర్ సీఐ నాగరాజుగౌడ్, డీఐ సంతోష్ కుమార్, ఎస్‌ఐ లక్ష్మీనారాయణ బస్సు డిపోను సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. బీసీ బందులో కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి, జాతీయ బీసీ కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ ఈశ్వరయ్య, బీసీ ఇంటలెక్చువల్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ఐఏఎస్ చిరంజీవులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ చైర్మన్, డీఎస్పీ వ్యవస్థాపక అధ్యక్షుడు విశారదన్ మహరాజ్, జీహెచ్‌ఎంసీ ఫ్లోర్ లీడర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి, రాష్ట్ర ఇసుక లారీ యజమానుల సంఘం అధ్యక్షుడు యాదయ్యగౌడ్, బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కృష్ణ పాల్గొన్నారు.

ట్రాఫిక్ జామ్..

బీసీ బంద్‌లో భాగంగా ఎల్బీనగర్‌లోని మహనీయుల విగ్రహాల వద్ద బీసీ సంఘాలు, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన బీసీ నాయకులు శనివారం చేపట్టిన నిరసన, ఆందోళనతో ఎల్బీనగర్ నుంచి ఉప్పల్ వెళ్లే ప్రధానరోడ్డుకు ఇరువైపులా భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఎల్బీనగర్ ఏసీపీ కృష్ణయ్యగౌడ్, ట్రాఫిక్ పోలీసులు తీవ్రంగా శ్రమించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.



ఎల్బీనగర్ ప్రధానరోడ్డుపై భారీగా ఏర్పడిన ట్రాఫిక్‌జామ్



ఐఎస్‌సదన్ చౌరస్తాలో కేంద్ర ప్రభుత్వం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్, సీపీఐ, సీపీఎం నేతలు



ముసారాంబాగ్ చౌరస్తాలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు



దిల్‌సుఖ్‌నగర్‌లో బీసీ ఐక్య వేదిక అధ్యక్షుడు అనంతయ్య, కాంగ్రెస్ నాయకుడు శశిధర్‌రెడ్డిలను అడ్డుకుంటున్న మలక్‌పేట పోలీసులు



హయత్‌నగర్ బస్సు వద్ద ఎల్‌బీనగర్ డీసీపీ అనురాధ, పోలీస్ సిబ్బంది



మిధానీ ఆర్టీసీ బస్ డిపో ముందు నిర్వహించిన బంద్‌లో పాల్గొన్న బీసీ సంఘాల నేతలు, ఆర్టీసీ సిబ్బంది



హస్తినాపురం చౌరస్తాలో నిర్వహించిన రాస్తారోకోలో పాల్గొన్న సీపీఎం నాయకులు

చెరువుల అభివృద్ధికి రూ.4.60కోట్లు మంజూరు

- ఎమ్మెల్యే సబితారెడ్డి వెల్లడి

సరూర్‌నగర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మహేశ్వరం నియోజకవర్గంలోని బాలాపూర్ పెద్దచెరువు, జిల్లెలగూడ చందచెరువు అభివృద్ధి కోసం రూ.4.60కోట్లు మంజూరయ్యాయని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి తెలిపారు. 2022-23 సంవత్సరంలో సదరు చెరువుల అభివృద్ధికి నిధులు కోరుతూ ప్రతిపాదనలు పంపించగా మూడేళ్ల తర్వాత ఆ ప్రతిపాదనలకు మోక్షం లభించిందని ఆమె అన్నారు. శుక్రవారం రాత్రి పెద్దచెరువు, చందచెరువులను ఎమ్మెల్యే సందర్శించారు. గతంలో గతంలో చేపట్టిన సుందరీకరణ పనులను పరిశీలించారు. పెద్దచెరువు అభివృద్ధికి రూ.1.80కోట్లు, చందచెరువు అభివృద్ధికి రూ.2.80కోట్లు మంజూరయ్యాయని, సదరు నిధులతో చెరువులను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఈఈ వేణుగోపాల్, వర్క్ ఇన్‌స్పెక్టర్ అశోక్, బీఆర్‌ఎస్ మీర్‌పేట్ శాఖ అధ్యక్షుడు కామేశ్‌రెడ్డి, నాయకులు అంజయ్య, ప్రభాకర్‌రెడ్డి, అవినాశ్ పాల్గొన్నారు.



చందచెరువు అభివృద్ధిపై అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

స్వీయ జాగ్రత్తలతో దీపావళి జరుపుకోవాలి



శ్రీధర్

మన్సూరాబాద్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): స్వీయ జాగ్రత్తలు పాటిస్తూ దీపావళి పండుగను జరుపుకోవాలని ఎల్బీనగర్ అగ్నిమాపక కేంద్ర అధికారి శ్రీధర్ ప్రజలకు సూచించారు. దీపావళి పర్వదినం సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శనివారం ఆయన మాట్లాడారు. పర్యావరణ హితమైన దీపాలు, తక్కువ శబ్దం చేసే బాణసంచాలు ఉపయోగిస్తూ కాటన్ లేదా అగ్ని నిరోధన వస్త్రాలు ధరించాలన్నారు. టపాసులు కాల్చే సమయంలో పిల్లలు, వృద్ధులు, పెంపుడు జంతువులను వాటికి దూరంగా ఉంచాలన్నారు. విద్యుత్ పరికరాలు, గ్యాస్ సిలిండర్లకు దూరంగా ఉండాలన్నారు. అనుమతులు పొందిన విక్రేతల వద్దే నాణ్యమైన టపాసులు కొనుగోలు చేసి వాటిని బహిరంగ ప్రదేశాల్లో మాత్రమే కాల్చాలని సూచించారు. విక్రేతలు తమ దుకాణాలు, స్టాళ్ల వద్ద నీరు, ఇసుక బకెట్లతో పాటు ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు దగ్గర ఉంచుకోవాలన్నారు.

మార్కెట్‌కు వరుసగా మూడు రోజులు సెలవు

ఓల్డ్‌మలక్‌పేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మలక్‌పేటలోని హైదరాబాద్ జాతీయ వ్యవసాయ మార్కెట్‌కు వరుసగా మూడు రోజులు సెలవులు వచ్చాయి. ఆదివారం సాధారణ సెలవు, సోమవారం దీపావళి, మంగళవారం అమావాస్య కావడంతో మార్కెట్ బంద్ ఉంటుంది. ఈ విషయాన్ని రైతులు గమనించాలని ఉన్నత శ్రేణి కార్యదర్శి నర్సింహారెడ్డి తెలిపారు. బుధవారం మార్కెట్ యథావిధిగా కొనసాగుతుందని ఆయన తెలిపారు.

సహకార సంఘం చైర్మన్‌గా జైపాల్‌రెడ్డి



జైపాల్‌రెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్: బాటసింగారం రైతుసేవా సహకార సంఘం చైర్మన్‌గా కొత్తపల్లి జైపాల్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం జిల్లా సహకార అధికారి ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో సంఘం చైర్మన్‌గా కొనసాగిన భరత్‌కుమార్‌ను సంఘం డైరెక్టర్‌గా తొలగించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రైతుల సంక్షేమం కోసం తన వంతు కృషి చేస్తానని జైపాల్‌రెడ్డి తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి: ఇన్‌స్పెక్టర్ అర్జున్

కొత్తపేట, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): వాహనదారులందరూ తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని టీటీఐ ఇన్‌స్పెక్టర్ అర్జున్ రాచపుడి సూచించారు. శనివారం పలు కూడళ్లలో 618 మంది విద్యార్థులు, వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సురక్షిత వాహన ప్రయాణమే లక్ష్యంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన 32 మందికి వారి కుటుంబ సభ్యుల సమక్షంలో టీటీఐ లెక్చర్‌హాల్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఐ సంతోష్ కుమార్, ఎస్‌ఐ నర్సింహారావు, ఎస్‌పీఓ అమరవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న టీటీఐ ఇన్‌స్పెక్టర్ అర్జున్ రాచపుడి

ట్రాఫిక్ వలంటీర్లకు శిక్షణ..

రాచకొండ కమిషనరేట్‌లో 43 మంది ట్రాఫిక్ వలంటీర్లకు ఎల్‌బీనగర్‌లోని టీటీఐ పిల్లల శిక్షణ పార్కులో ట్రాఫిక్ విధులపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కూడళ్లలో ట్రాఫిక్ నియంత్రణకు చేపట్టాల్సిన విధులు, ఎంవీ యాక్టులో విశేషాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పీఓ అమరవర్ధన్‌రెడ్డి, ఎస్‌పీఓ అల్లూరయ్య, ఏఆర్‌ఎస్‌ఐ సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): 'దుబాయ్‌కు వెళ్తున్నాను. మూడు నెలల వరకు తిరిగి రాను' అంటూ ఇంట్లో చెప్పిన ఓ యువకుడు నగర శివారులో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కవాడిపల్లి గుట్టల ప్రాంతంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా ఎర్కారం గ్రామానికి చెందిన బొర్ర నరేష్ కాలుష్య తనిఖీ వాహనంలో పనిచేస్తూ నగరంలోని రాయదుర్గం షేక్‌పేటలో నివాసం ఉంటున్నారు. గత నెల సెప్టెంబర్ 29న ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన అతడు సోదరుడికి ఫోన్ చేసి దుబాయ్ వెళ్తున్నానని మూడు నెలల వరకు రానంటూ చెప్పాడు. అనంతరం అతడి ఫోన్ స్విచ్ ఆఫ్ చేశాడు. మరుసటి రోజు అతడి సోదరుడు రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు పెట్టాడు. అయితే అతడు అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కవాడిపల్లి గుట్టల్లో తాడుతో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గుట్టల ప్రాంతంలో చెట్టుకు మృతదేహం వేలాడుతుందని అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులకు శనివారం ఉదయం సమాచారం అందింది. వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. అక్కడ లభించిన సెల్‌ఫోన్ ఆధారంగా మృతుడి వివరాలు సేకరించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఆర్థిక ఇబ్బందులతో మానసికంగా కుంగిపోయి ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు తెలిపారు.

● శబరిమలకు అయ్యప్పస్వాములు



హస్తినాపురం డివిజన్ డిఫెన్స్‌కాలనీలోని హరిహర క్షేత్ర అయ్యప్పస్వామి ఆలయం నుంచి శనివారం 150 మంది అయ్యప్ప స్వాములు ఇరుముడితో కేరళలోని శబరిమల ఆలయంకు మహాపాదయాత్రగా బయలుదేరారు. కార్యక్రమంలో స్వాములు శేఖర్‌రెడ్డి, సునీల్, మోహన్, భూపేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

- చంపాపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి)

● మునిగిన పద్మావతికాలనీ



హయత్‌నగర్ డివిజన్‌లోని పద్మావతికాలనీలో రెండు రోజులుగా జలమండలి అధికారులు ట్రంకులైన్ పైపులైన్ మరమ్మతులు చేపడుతున్నారు. అందుకోసం మురుగనీటి ప్రవాహన్ని ఆపివేయడంతో పద్మావతి కాలనీలోని మ్యాన్‌హోల్స్ నుంచి మురుగునీరు బయటకు వచ్చి రోడ్డుపై నిలిచింది. దీంతో స్థానికులు దుర్గంధంతో ఇబ్బంది పడుతున్నారు. పనులు పూర్తి కాగానే మురుగునీరు సాఫీగా వెళుతుందని, ప్రజలు సహకరించాలని జలమండలి డీజీఎం రాజగోపాల్, డివిజన్ ఏఈ వాహిని కోరారు.

- హయత్‌నగర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి)

పారిశుధ్య కార్మికురాలికి లైంగిక వేధింపులు

- మాదన్నపేట పీఎస్‌లో కేసు నమోదు

సైదాబాద్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీ పారిశుధ్య కార్మికురాలిపై లైంగిక వేధింపులకు పాల్పడిన సూపర్‌వైజర్‌పై మాదన్నపేట పోలీసులు కేసు నమోదు చేశారు. రెయిన్‌బజార్ ప్రాంతంలో పారిశుధ్య విధులు నిర్వహిస్తున్న కార్మికురాలి పట్ల సూపర్‌వైజర్ నర్సింహ అసభ్యపదజాలంతో, లైంగి వేధింపులకు పాల్పడతున్నాడు. దీంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు మాదన్నపేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.